ముగ్గుపోశారు.. నిర్మాణం మరిచారు

- మచ్చుకైనా కనిపించని మోడల్ ఇళ్ల నిర్మాణం
- పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో సాగని ఇందిరమ్మ ఇళ్ల పనులు
- ప్రభుత్వ లక్ష్యానికి అధికారుల నిర్లక్ష్యం


మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసిన స్థలం ఇదే..

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వం మండలాని కో మోడల్ భవనం నిర్మించాలనే లక్ష్యంతో చేపట్టిన నిర్మాణ పనులు మచ్చుకైన కనిపించడం లేదు. కేవలం అధికారులు ఆర్భాటాలతో మాత్రం డైట్ కళాశాల పక్కనే గల ఓ స్థలాన్ని ఎంపీడీవో, తహసీల్దార్ గుర్తించి ముగ్గుపోసి చేతులు దులుపుకున్నారు. ఇంత వరకు ఆ స్థలంలో ఎలాంటి పనులు సాగడం లేదు. జిల్లా కేంద్రానికి ఆమడ దూరంలో ఉన్న హవేళిఘణాపూర్ మండల కేంద్రంలో పరిస్థితి ఇలా ఉంటే.. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పథకాలు ఎంత మేరకు కొనసాగుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల పరిధిలోని కొచ్చెరు తండాను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం 56 దరఖాస్తులు రాగా, అందులో 30 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారు. కేవలం ఒక్కరు మాత్రమే పనులు ప్రారంభించగా.. మిగతా వారు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం నిర్లక్ష్యంగానే కొనసాగుతోంది.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి


వెంకటాయిపల్లిలో మాట్లాడుతున్న నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

తూప్రాన్: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. తూప్రాన్ మండలంలోని కోనాయిపల్లి, మల్కాపూర్, నాగులపల్లి, వెంకటాయిపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా భారత రాజ్యాంగ పరిరక్షణ గురించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తుందని ఆరోపించారు. అంతకు ముందు గ్రామాల్లో రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం ప్రారంభించారు. అనంతరం వెంకటాయిపల్లిలో దళితుడు బోడ్డు శేఖర్ ఇంట్లో ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. కాగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పుమ్మన్నగారి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టారు, ఘనపూర్, మనోహరాబాద్ మండలంలోని ఆగ్రాహారం గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి పెంటాగౌడ్, రఘునాథరావు, మామిళ్ల కృష్ణ, రవీందర్‌గుప్తా, మల్లేశ్, స్వామిగౌడ్, సత్యనారాయణగౌడ్, నాగరాజుగౌడ్, శ్రీనివాస్, అనిల్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథంలో సీతారామచంద్రుల విగ్రహాలను ఉంచి, గ్రామపురవీధుల గుండా ఊరేగించారు. దారి పొడువునా మహిళలు, భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయన కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన


వెంకటాపూర్(ఆర్)లో ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి సూచనలు చేస్తున్న ఏఈ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్)లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీనివాస్ పరిశీలించి లబ్ధిదారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయడంతో 49 ఇళ్లు మంజూరయినట్లు తెలిపారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణం పనులు చేపట్టాలని అవగాహన కల్పించారు. ప్రస్తుతం పదిమంది లబ్ధిదారులు మాత్రమే పనులు ప్రారంభించారని, ఇద్దరు బేస్‌మెంట్ పూర్తిచేసినట్లు తెలిపారు. పూర్తయిన బేస్‌మెంట్ ఫొటో దించడం ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. త్వరలో ఇద్దరికి బేస్‌మెంట్ బిల్ వస్తుందని చెప్పారు. మిగతావారు సైతం పనులు ప్రారంభించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. నర్సాపూర్, కౌల్చారం మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో 15 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఎం.కిషన్, మాజీ జెడ్పీటీసీ రాజేందర్ పాటిల్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్, వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్లు సంగమేశ్వర్, భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

కౌల్చారం(నర్సాపూర్): పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా అందిస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన పాడేపు లక్ష్మికి సంబంధించిన రూ.25 వేల చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం వరిగుంతంలో ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

నిరుపేద విద్యార్థికి లాప్‌టాప్ బహూకరణ

చిన్నశంకరంపేట(మెదక్): ఇంజనీరింగ్ చదువుతున్న నిరుపేద గిరిజన విద్యార్థికి సానీక్ష ఫౌండేషన్ అధ్వర్యంలో లాప్‌టాప్ బహూకరించారు. మండలంలోని ఖాజాపూర్ తండాకు చెందిన రాజు కూతురు ప్రేమలత బీవీఆర్‌టీ కాలేజీలో బీటెక్ చదువుతోంది. తనకు లాప్‌టాప్ తప్పనిసరిగా కావాలని కళాశాల అధ్యాపకులు చెప్పడంతో తండ్రికి ఈ విషయం వివరించింది. లాప్‌టాప్ కొనలేని స్థితిలో ఉన్న అతను సాయం చేయాలని సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ శివ దృష్టికి తీసుకొచ్చాడు. దీంతో హైదరాబాద్‌కు చెందిన హెచ్‌టూహెచ్, అహల్యా ఫౌండేషన్ సహకారంతో లాప్‌టాప్‌ను విద్యార్థినికి అందించారు. ఈ కార్యక్రమంలో సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ శివ, ఫీల్డ్ ఆఫీసర్ రవి, సురేశ్, రామ్‌చరణ్ ఉన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి


మాట్లాడుతున్న న్యాయవాది మధుశ్రీ

నర్సాపూర్: విద్యార్థులు అంకిత భావంతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని పలువురు న్యాయవాదులు హితవు పలికారు. రాష్ట్ర న్యాయ సేవ అధికారి సంస్థ ఆదేశాలతో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ సిరి సౌజన్య ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయ వి/జ్ఞాన సదస్సులో స్థానిక కోర్టుకు చెందిన న్యాయవాదులు స్వరూపరాణి, మధుశ్రీ, రాజునాయక్, సాయిరాం, రవినాయక్ పాఠశాలలో మాట్లాడుతూ.. విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, ఆడపిల్లలకు తండ్రి ఆస్తిలో సమాన వాటా చట్టం, ఫోక్సో చట్టం తదితర చట్టాలను వారికి వివరించి చెప్పారు.

నేడు ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు ఏపీఎం లక్ష్మీనర్సమ్మ తెలిపారు. వడియారం, అనంతసాగర్, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో కొగులోలు కేంద్రాల ప్రారంభోత్సవాల్లో ఆయా గ్రామాల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మైక్‌సెట్ అందజేత

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లో పునర్నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి దాత హెడ్ కానిస్టేబుల్ గొల్ల కిషన్‌యాదవ్ మంగళవారం రూ.20 వేలతో మైక్‌సెట్ అందజేశారు. ప్రతీ ఒక్కరికీ సేవా దృక్పదం కలిగి ఉండాలని కిషన్ యాదవ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు విఠల్‌రావు పంతులు, పీఏసీఎస్ డైరెక్టర్ నాగేందర్‌రావు కులకర్ణి, రాజేశ్వర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చిరుసంచుల వరిసాగుతో అధిక దిగుబడి



ఫైజాబాద్‌లో రైతు గోపాల్‌రావు వరిపంటను పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్త రాహుల్

సంగుపేట ఏరువాక శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతుల ఆసక్తితోనే చిరుసంచుల వరిసాగుతో అధిక దిగుబడి సాధ్యమవుతుందని సంగుపేట ఏరువాక శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఫైజాబాద్ గ్రామానికి చెందిన గోపాల్‌రావు అనే రైతుకు అందించిన పలురకాల సన్నరకం చిరుసంచుల వరిసాగును పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ మాట్లాడుతూ.. రైతుకు అందించిన వరంగల్-1537 అనే రకం ప్రస్తుతం చాలా బాగుందన్నారు. ఈ రకం కంకిలో 175 నుండి 190 గింజలు గమనించామని తెలిపారు. ఈ రకం సాగు మోగిపురుగు అగ్గితెగులును సమర్థంగా తట్టుకునే రకం అన్నారు. రైతులు ఎక్కువగా సాగు చేసే ఎంటీయూ 1010. కేఎన్ఎం 118 రకాలకు పోటీగా దిగుబడి ఇచ్చే రకం అన్నారు. పంట వ్యవధి 125 రోజులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త శ్రీకాంత్, రైతు అనిల్‌కుమార్ ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ త్వరగా పూర్తి చేయాలి

ఎంపీడీఓ శ్రీనివాస్


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): ఎల్ఆర్ఎస్ త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ కోసం 694 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 119 మంది డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. మిగతా దరఖాస్తుదారులు సైతం త్వరగా డబ్బులు చెల్లించేలా చూడాలని తెలిపారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే తర్వాత వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను గుర్తించాలని తెలిపారు. మండలంలోని మిగిలిపోయిన వీడబ్ల్యూఎస్ (విలేజ్ వాటర్ శానిటేషన్ కమిటీ) నిధులు గ్రామ పంచాయతీ ఖాత నుంచి వెనిక్కి పంపాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్ల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనారు.

రికార్డుల నిర్వహణ పూర్తి చేయండి

ఎంఈఓ నీలకంఠం


మాట్లాడుతున్న ఎంఈవో నీలకంఠం

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ పాఠశాలల హెచ్‌ఎంలు పాఠశాలలకు సంబంధించిన రికార్డులను పూర్తి చేయాలని ఎంఈవో నీలకంఠం అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ పాఠశాల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. గతంలో అసంపూర్తిగా ఉన్న రికార్డులను వెంటనే పూర్తి చేసి, సీసీ మార్కులు ఆడిట్ రిపోర్టులను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. విద్యార్థుల సెలవు రోజుకు ముందే అన్ని సిద్ధం చేసుకొని ఉండాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, మండల ఆపరేటర్‌లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి కృషి


ధ్యాన మందిరానికి భూమి పూజ చేస్తున్న అర్చకుడు, హనుమంత్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పెద్దగొట్టిముక్లలోని పురాతన సంగమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని గ్రామవాసి, సీనియర్ న్యాయవాది హనుమంత్‌రెడ్డి అన్నారు. ఆలయం వద్ద ధ్యాన మందిర నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఆలయ పున: నిర్మాణం చేపట్టామని, మరిన్ని మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పలువురి దాతల సహకారంతో ధ్యాన మందిరం పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు చండీకశర్మ, ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు


బుజ్రాన్‌పల్లిలో మొక్కలకు నీరందిస్తున్న ఈజీఎస్ సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): వేసవిలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ విఠల్‌రెడ్డి ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. గతంలో నాటిన మొక్కలతో పాటు నర్సరీలో పెంచుతున్న మొక్కలకు నీరు అందించే బాధ్యత ఈజీఎస్ సిబ్బందిదేనన్నారు. ఉపాధిహామీ పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం


శ్రీరామ పట్టాభిషేకంలో పాల్గొన్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని అభయ సీతారామాలయం 32వ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ అర్చకుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో సీతా రామచంద్రస్వామికి ప్రత్యేక పూజలతో పాటు హోమం చేశారు. అనంతరం శ్రీరామునికి పట్టాభిషేకం ఘనంగా నిర్వహించి, అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పద్మానర్సింహరెడ్డి, ఆలయ భజనమండలి సభ్యులు పురుషోత్తం, కౌడ శ్రీనివాస్‌గుప్తా, జగన్, శ్రీనివాస్, దశరథ, బ్రహ్మాచారి, ప్రతాప్ రెడ్డి, పెంచలయ్య, ఎల్లం గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తే చర్యలు


ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న ఆర్ఐ సునీల్‌సింగ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా మంజీరా వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ సింధూజ అన్నారు. మంగళవారం మండలంలోని చండూర్ గ్రామ శివారులోని మంజీరా వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణాకు గురైన స్థలాన్ని, చేసిన ఇసుక డంప్‌ను ఆర్ఐ సునీల్‌సింగ్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం


ఎమ్మెల్సీని సన్మానిస్తున్న నాయకులు

నర్సాపూర్: ఉమ్మడి కరీంగనర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ఎమ్మెల్సీగా గెలుపొంది ప్రమాణం చేసిన అంజిరెడ్డిని పలువురు బీజేపీ నాయకులు మంగళవారం కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్‌గౌడ్‌లతో పాటు పలువురు నాయకులు అంజిరెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సన్నబియ్యం సద్వినియోగం చేసుకోవాలి


మండలంలోని గవ్వలపల్లిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ నరేందర్

చిన్నశంకరంపేట(మెదక్): పేద ప్రజల కోసం ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, చిన్నశంకరంపేట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ కోరారు. మంగళవారం మండలంలోని గవ్వలపల్లిలో సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదవరావు, బాబురావు పాల్గోన్నారు. కొర్విపల్లిలో కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి రామచంద్రం, ఉదయ్ ఉమార్ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించండి


విద్యార్థులతో మాట్లాడుతున్న నర్సింగం

మనోహరాబాద్(తూప్రాన్): విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేయాలని కాళ్లకల్ క్లస్టర్ హెచ్‌ఎం నర్సింగం అన్నారు. మంగళవారం మండలంలోని కొండాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. వీరి వెంట హెచ్‌ఎం కుమారస్వామి, ఉపాధ్యాయురాలు శిరీషలు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర


జీడిపల్లిలో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపు, జై బీమ్ సంవిధాన్ పేరుతో అంబేడ్కర్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. మండలంలోని జీడిపల్లి, పాలాట, తుపాకులపల్లి గ్రామాల్లో తూప్రాన్, మనోహరాబాద్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. అంతకు ముందు రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గోన్నారు.

రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలోని రైస్ మిల్లులపై మంగళవారం మైద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ వెంకటేశం ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ , ధాన్యంపై విచారణ కొనసాగుతుందని, అక్రమాలు జరిగినట్లు తేలితే కేసు నమోదు చేస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన**

చిన్నశంకరంపేట(మెదక్): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ కోరారు. మంగళవారం మండలంలోని ధరిపల్లి గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భిణుల బరువు, ఎత్తు ఆరోగ్య లక్షణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు తీసుకోవాల్సిన పోషక ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు పద్మ, ఇందిర పాల్గొన్నారు.

◆ **సమాజంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర**

పెద్దశంకరంపేట(మెదక్): సమాజంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు అశోక్‌కుమార్, రాములు, కొండల్‌రెడ్డి, ఎంఈఓ వెంకటేశం అన్నారు. మంగళవారం మండలంలోని ఉత్తులూర్ పాఠశాల హెచ్‌ఎం ఎం.సంగమేశ్వర్ పదవీ విరమణ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, విఠల్, రామచంద్రాచారి, రవీందర్, బి.శ్రీనివాస్, కుమార్, మారుతి, గోపి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఇళ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టండి**

మనోహరాబాద్(తూప్రాన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లలో భాగంగా పైలట్ గ్రామంలో ఎంపికైన లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి కోరారు. మంగళవారం మండలంలోని ముప్పిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారికి పలు సూచనలు చేశారు. ప్రారంభించిన ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని దశల వారీగా వారికి నిధులు మంజూరవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వామిగౌడ్ పాల్గొన్నారు.

◆ **పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముట్రాజ్‌పల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో రేషన్‌షాపుల వద్ద మంగళవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మండలాధ్యక్షుడు రాకేశ్ ఆధ్వర్యంలో పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్, కుమార్, నందు, సాయి, నరేష్, గణేశ్, నాగరాజు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

◆ **గ్రామాభివృద్ధికి అండగా ఉంటాం**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామావసరాలను పంచాయతీ కార్యదర్శి స్వామిగౌడ్ గ్రామ సమస్యలను వీఎస్టీ పరిశ్రమ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో వారు స్పందించి తాగునీటి సమస్యకు 4 సింగిల్ ఫేస్ మోటార్లు, పంపు సెట్లను, ఉన్నత పాఠశాలలకు, పంచాయతీ కార్యాలయానికి వాటర్‌కూలింగ్ మిషన్లు అందజేశారు. అంతేకాకుండా 100 సోలార్ లైట్లను వీధుల్లో ఏర్పాటు చేయిస్తామని హామీనిచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

◆ **జై బాపు, జైబీమ్, జైసంవిధాన్ ఇన్‌చార్జిగా రాజాగౌడ్**

చిన్నశంకరంపేట(మెదక్): ఏఐసీసీ తలపెట్టిన జై బాపు, జైబీమ్, జైసంవిధాన్ కార్యక్రమ నార్సింగి మండల సమన్వయకర్తగా రాజాగౌడ్‌ను నియమిస్తూ దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

◆ **అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు**

శివ్వంపేట(నర్సాపూర్): అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధింపులకు గురిచేస్తున్నారని ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి కథనం ప్రకారం... శివ్వంపేటకు చెందిన వివాహిత నర్సమ్మ అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుఉన్న భర్త మైసయ్యతో పాటు అత్త సత్తమ్మ, ఆడపడుచులు సత్తమ్మ, మంజులపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

◆ **ఘనంగా బోనాల ఉత్సవాలు**

కౌల్చారం(నర్సాపూర్): మండలంలోని వరిగుంత , ఎనగండ్ల గ్రామాల్లో మంగళవారం బోనాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఎనగండ్లలో శ్రీమహారేణుక ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవంలో భాగంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. వరిగుంతం గ్రామంలో కూడా బోనాలను ఊరేగించారు.

◆ **అక్రమ కేసులకు భయపడం**

తూప్రాన్: కాంగ్రెస్ నాయకుల అక్రమ కేసులకు భయపడేది లేదని మాజీ మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయనకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ గత ఏడాది మున్సిపల్‌లో పన్నుల పెంపుపై స్పందించి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఇందుకు కాంగ్రెస్ నాయకులు అక్రమంగా మున్సిపల్ అధికారులతో కేసులు పెట్టించారని ఆరోపించారు.